# అభివృద్ధి, సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం

- మరోసారి ఆశీర్వదించండి...అండగా ఉంటా..
- బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దివాకర్‌రావు
- లింగాపూర్‌లో ఇంటింటా ప్రచారం



దండేపల్లి : లింగాపూర్‌లో ఓటడుగుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

దండేపల్లి, నవంబర్ 25: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని మంచిర్యాల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు కోరారు. దండేపల్లి మండలంలోని లింగాపూర్‌లో శనివారం ఇంటింటా తిరుగుతూ ప్రచారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ సర్కారు చేసిన మేలును ఎప్పటికీ మరువవద్దన్నారు. మోసపోయి ఇతర పార్టీలకు ఓటేస్తే ఐదేళ్ల పాటు ఇబ్బంది పడతామన్నారు. ఆలోచించి ఓటు వేయాలన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత బీఆర్ఎస్ సర్కారుదేనన్నారు. సంక్షేమ పథకాలతో పాటు గ్రామాలను కూడా అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. మరోసారి మీరు ఆశీర్వదిస్తే గ్యాస్ సిలిండర్ రూ.400కే ఇస్తామని, గృహలక్ష్మి పథకం కింద నిరుపేదలకు నెలనెలా రూ.3వేల పింఛన్ అందిస్తామన్నారు. ఎన్నికల ముందు కల్లబొల్లి మాటలు చెప్పే నాయకులను చూసి మోసపోవద్దన్నారు. కాంగ్రెస్ గెలిస్తే ఉన్న కరెంటు పోతుందన్నారు. 3 గంటల కరెంటు అంటున్న కాంగ్రెస్‌ను తరిమి కొట్టాలన్నారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ కాసనగొట్టు లింగన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, యూత్ నాయకులు, నాయకులు పాల్గొన్నారు.



దండేపల్లి : 'తమ్మీ...కారు గుర్తును మర్చిపోవద్దు' అంటున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

**అభివృద్ధి చేసినం ఓట్లడుగుతున్నాం...**

బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి చేశామని, అందుకే మీ ముందుకు వచ్చి ధైర్యంగా ఓట్లడుగుతున్నామని, బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. దండేపల్లి మండలంలోని రెబ్బెన్‌పెల్లిలో శనివారం రాత్రి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో గ్రామానికి బ్రిడ్జి నిర్మించడంతో పాటు సీసీ రోడ్లు, డ్రైనేజీలతో పాటు గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశామన్నారు. అంతకుముందు గ్రామంలో ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా కన్వీనర్ గురువయ్య, నడిపెల్లి ట్రస్ట్ చైర్మన్, యువ నాయకులు విజిత్‌రావు, వైస్ ఎంపీపీ అనిల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ బండారి మల్లేశ్, యూత్ నాయకులు పాల్గొన్నారు.

**గౌతమీనగర్‌లో ఎమ్మెల్యే కుటుంబసభ్యుల ప్రచారం**

మంచిర్యాలటౌన్, నవంబర్ 25: మంచిర్యాల పట్టణంలోని 27వ వార్డు గౌతమీనగర్‌లో శనివారం మంచిర్యాల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దివాకర్‌రావు కుటుంబసభ్యులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ సిరికొండ పద్మ కొండాల్‌రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సతీమణి రాజకుమారి, కోడలు ఉదయశ్రీ ఇంటింటికీ తిరుగుతూ ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటు వేసి దివాకర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. నిత్యం ప్రజల్లో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ నియోజకవర్గం అభివృద్ధికి ఎనలేని కృషిచేస్తున్న దివాకర్‌రావుకే ఓటువేసి గెలిపించాలని కోరారు. తొమ్మిదేళ్ల కితం మంచిర్యాల ఎలా ఉండేదో, ప్రస్తుతం ఎలా ఉందో ఒకసారి ఆలోచించాలని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక పట్టణాలు, పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషిచేస్తున్నదన్నారు. కారుగుర్తుకు ఓటువేయాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లో చేరిన రాజీవ్‌నగర్ వాసులు**

మంచిర్యాలటౌన్, నవంబర్ 25: మంచిర్యాల పట్టణం ఒకటో వార్డు రాజీవ్‌నగర్ నుంచి 100 మంది కాంగ్రెస్ కార్యకర్తలు, ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలు శనివారం సాయంత్రం బీఆర్ఎస్ యూత్‌నాయకులు నడిపెల్లి విజిత్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఒకటోవార్డు కౌన్సిలర్ బుద్దార్థి సత్తమ్మ, రాంచందర్ ఆధ్వర్యంలో వీరంతా గులాబీ కండువా కప్పుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నామని, వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు గెలుపుకోసం తామంతా కృషిచేస్తామని పార్టీలో చేరినవారంతా పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో జుమ్మిడి కుమార్, అన్వర్, వారి అనుచరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాళ్లు కళ, సువర్ణ, పార్టీ వార్డు అధ్యక్షుడు ఆకుల సతీశ్, గౌస్, సర్వర్, ఆంజనేయులు, రాజు, అశోక్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లో చేరిన యువకులు**

లక్షెట్టిపేట, నవంబర్ 25: మండలంలోని దౌడేపల్లి గ్రామంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన సుమారు 50మంది కార్యకర్తలు శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. జరిగింది. పార్టీలో చేరిన యువకులకు లక్షెట్టిపేటలో ఎమ్మెల్యే తనయుడు నడిపల్లి విజిత్‌రావు, జడ్పీటీసీ ముత్తె సత్తయ్య పాకండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి పనులకు, ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్శితులై యువకులు కాంగ్రెస్ పార్టీతో పాటు వివిధ పార్టీలను వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం యువకులు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని అభినందించారు. మన మంచిర్యాల నియోజకవర్గంలో రౌడీల పాలన వద్దని దివాకర్‌రావు గెలుపే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ తిప్పని లింగన్న, పార్టీ మండల అధ్యక్షుడు చుంచు చిన్నయ్య, డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు అంకతి గంగాధర్, మండల ఉపాధ్యక్షుడు అంకతి రమేశ్, ప్రధానకార్యదర్శి అనిల్ రెడ్డి, కారుకూరి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం**

జన్నారం, నవంబర్ 25 : బీఆర్ఎస్‌తోనే జన్నారం మండలం అభివృద్ధి చెందుతుందని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సిటిమల్ల భరత్‌కుమార్, అల్ల నరేశ్ అన్నారు. శనివారం మండలంలో పొనకల్, రేండ్లగూడ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని పలు గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో బోర్లకుంట ప్రభుదాస్, అల్లంరవి, దుమల్ల ఎల్లయ్య, బచ్చలి కృష్ణ, జంగ రవి, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



దండేపల్లి : లింగాపూర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు



దండేపల్లి : రెబ్బెన్‌పెల్లిలో సభకు హాజరైన ప్రజలు



జన్నారం : రేండ్లగూడలోని తంగళ్లపెల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్‌నాయకులు



లక్షెట్టిపేట : బీఆర్ఎస్‌లో చేరిన యువకులతో జడ్పీటీసీ సత్తయ్య, నడిపెల్లి విజిత్‌రావు

## దండేపల్లి పాఠశాలలో నమూనా పోలింగ్



నమూనా ఎన్నికల్లో భాగంగా ప్రమాణ స్వీకారం చేస్తున్న విద్యార్థులు

దండేపల్లి, నవంబర్25: దండేపల్లి మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నమూనా పోలింగ్ నిర్వహించారు. రాజ్యాంగంలో పొందుపర్చిన విధంగా ప్రజాస్వామ్య దేశంలో జరిగే ఎన్నికల విధానంపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఎన్నికల ప్రక్రియ గురించి విద్యార్థులకు తెలియజేసేందుకు ఈ మాదిరి పోలింగ్ ఉపయోగపడుతుందని హెచ్‌ఎం బీసగోని శంకర్‌గౌడ్ తెలిపారు. ఓటరు లిస్ట్ తయారు చేయడం, పోలింగ్ సిబ్బందిని నియమించడం, క్రమ పద్ధతిలో ఓట్లు వేయించడం, కౌంటింగ్ నిర్వహించే ప్రక్రియను విద్యార్థులతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## మహాలక్ష్మి ఆలయంలో కుంకుమపూజలు

జన్నారం, నవంబర్ 25 :మండలంలోని పొనకల్ గ్రామ పంచాయతీలోని మహాలక్ష్మి ఆలయ రెండవ వార్షికోత్సవం సందర్భంగా మహిళా భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

## దరఖాస్తుల ఆహ్వానం

లక్షెట్టిపేట, నవంబర్ 25: పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో పీజీ విద్యను అభ్యసించేందుకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ జైకిషన్ ఓజా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్, కంప్యూటర్స్, ఎంకాం కోర్సుల్లో సీట్లు ఖాలీగా ఉన్నాయని ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సీపీ గెట్ ఎంట్రన్స్ టెస్ట్‌లో ఉత్తీర్ణత ఉన్నవారికి, డిగ్రీలో 50శాతం మార్కులు సాధించి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని పూర్తి వివరాలకు 8978250444 ఫోన్ నంబర్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

## ఘనంగా కార్తీకశుద్ధ త్రయోదశి



సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

దండేపల్లి, నవంబర్25: దండేపల్లి మండలంలోని గూడెం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో కార్తీక మాసంలో జరిగే జాతరకు రెండు రోజుల ముందే భక్తుల రద్దీతో కిటకిటలాడుతుంది. శనివారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గోదావరి వద్ద పుణ్య స్నానాలు ఆచరించి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక దీపాలను గోదావరిలోకి వదిలారు. అనంతరం గుట్టపై ఉన్న స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గుట్టపై భాగంలో 509 జంటల సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నోముకున్నారు. అదనంగా రెండు వ్రత మండపాలు ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో ఉన్న రావిచెట్టు వద్ద, గుట్ట పైభాగంలో ఉన్న ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. 1000 మందికి అన్నదానం నిర్వహించారు

## 28 ఉమెన్స్ జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు

శ్రీరాంపూర్, నవంబర్ 25 : ఈ నెల 28న శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా ఉమెన్స్ కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇసంపెల్లి రాంచందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా జట్టు ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారిణులు తమ ఆధార్ కార్డుతో హాజరు కావాలని కోరారు. 100 రూపాయల ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పీఈటీ సదానందం పేర్కొన్నారు. జిల్లా ఉమెన్స్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ 4 నుంచి 7 వరకు నిజామాబాద్‌లో జరిగే 70వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9849124856, 9963719719 ద్వారా సంప్రదించాలని కోరారు.